# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


## విద్యుత్ షాక్‌కు గురై

# రెండు ఏనుగులు మృతి

**- నెరబైలు అటవీ ప్రాంతంలో ఘటన**



యర్రావారిపాలెం, మార్చి 9, ప్రభాతవార్త:
యర్రావారిపాలెం మండలం, నెరబైలు పంచాయతీ, పాత తురకపల్లి సమీపం అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలకు తగిలి రెండు ఏనుగులు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. నెరబైలు గ్రామానికి చెందిన అక్తర్ బాషా అను అతని భూమిని షామీర్ అనే రైతు కౌలుకు తీసుకొన్నాడు. ప్రస్తుతం వేసవికాలం సమీపిస్తున్న కారణంగా అటవీ ప్రాంతంలోని వన్యమృగాల బారి నుండి తాను సాగుచేసిన వేరుశనగ పంటను రక్షించుకునేందుకు పొలానికి చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతానికి ఆహారం కోసం వచ్చిన రెండు ఏనుగులు పొలం సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. సోమవారం ఉదయం 2 ఏనుగులు మృతి చెందిన ఘటన విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన ఏనుగులను పంచనామా నిర్వహించి ఏనుగులను ఖననం చేశారు. ఈ ఘటనపై ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. అటవీ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో పంటలను రక్షించుకునే క్రమంలో రైతులు చట్టవిరుద్ధంగా విద్యుత్ తీగలు వేయకూడదని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అడవి జంతువుల సంరక్షణకు అందరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్వో సాయిబాబా, ఫ్లయింగ్ స్క్వాడ్ రామ కోదండ రెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చైతన్య, నెరబైలు పశువైద్యాధికారి కృష్ణకాంత్, ఎఫ్ బీఓలు ప్రదీప్, నిఖిల్, రాజేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## నౌక కేంద్ర భూములు పరిశీలన : సీఈవో అభిషేక్

వాకాడు, మార్చి 9, ప్రభాతవార్త



వాకాడు మండలం వాగరు, పాతేటిపాలెం, పామాంజి, వాలమేడు గ్రామాలలో నౌకా కేంద్ర భూములను సోమవారం మారిటైం బోర్డు సీఈఓ అభిషేక్ పరిశీలించారు. ప్రభుత్వం గుర్తించిన భూములను ఎలాంటి సమస్యలు కలగకుండా చూసుకోవాలని స్థానిక సిబ్బందికి సూచించారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నౌక కేంద్ర నిర్మాణ కేంద్రం సూచించిన భూములను స్థానిక అధికారుల ద్వారా క్షుణ్ణంగా మ్యాప్ ద్వారా, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ రోణంకి గోవిందరావు, ఆర్డీవో దేవేంద్ర రెడ్డి, తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, డిప్యూటీ తహసిల్దార్ మహమ్మద్ రఫీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్, మురళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా కార్యాచరణ

**పాడి రైతులకు విరివిగా రుణాలు - జడ్పీ నిధులతో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతులు**

**- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**

చిత్తూరు, మార్చి 9 ప్రభాతవార్త:
వేసవి ప్రారంభం కావడంతో జిల్లాలో ఎక్కడ మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా పక్కా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా సమీక్షా సమావేశం అనంతరం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది మంచి వర్షాలు నమోదు కావడంతో జిల్లాలో ఈ వేసవిలో పెద్దగా మంచినీటి సమస్య ఉత్పన్నం అయ్యే అవకాశాలు వుండవన్నారు. జిల్లాలో పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో వేసవిలో మంచినీటి సమస్య ఉత్పన్నం అయ్యే అవకాశాలు వున్నాయని ఈ విషయంను అధికారులు ముందే గుర్తించి అక్కడ ఎలాంటి నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు. జిల్లాలోని కుప్పం, పలమనేరు, ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో వున్న పుంగనూరు నియోజకవర్గానికి కృష్ణానది నీటికి తీసుకువచ్చిన ఘనత సిఎం నారా చంద్రబాబునాయుడుదే అన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా రూ.3,600 కోట్లు ఖర్చు పెట్టి ఈ ప్రాంతాల్లో తాగు, సాగు నీటి సమస్య లేకుండా చేయడం జరిగిందన్నారు. జిల్లాలో వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ కీలకం కావడంతో పాడి రైతులకు బ్యాంకులు విరివిగా రుణాలు ఇప్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయంలో అంతగా లాభం లేని రైతులకు పాడి పరిశ్రమ చేయూత అందిస్తోందని, జిల్లాలోని పాడి రైతులు ప్రస్తుతం 20 నుండి 30 డైరీలకు పాలు సరఫరా చేస్తున్నారన్నారు. వీరు ఆర్థికంగా మరింత ఎదగడానికి బ్యాంకుల సహకారం ఎంతో అవసరం అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం పాడి రైతులకు సబ్సిడీ మంజూరు చేస్తే రుణ మొత్తంను బ్యాంకులు మంజూరు చేసేలా బ్యాంకు అధికారులతో చర్చించి అంగీకరించేలా చేస్తామన్నారు. పాడి రైతులకు ఎలాంటి షురిటీ లేకుండా రుణాలు మంజూరు అయ్యేలా చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గత ప్రభుత్వం తరహాలో కాకుండా ప్రస్తుత ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘ నిధులను పంచాయతీరాజ్ సంస్థలకు విడుదల చేసి ఖర్చు చేయడం జరిగిందన్నారు. అలాగే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా పరిషత్ నిధులు ఖర్చు చేసి మరమ్మత్తులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. సొంత ఇల్లులేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.




జిల్లా సమీక్షా సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

## కుప్పంలో ఫుడ్ కమీషన్ ఛైర్మన్

# సుడిగాలి పర్యటన

**హాస్టళ్లు.. బియ్యం గోడౌన్.. అంగన్‌వాడీకేంద్రాల తనిఖీ !!**



కుప్పం, మార్చి 9 ప్రభాతవార్త
రాష్ట్ర ఫుడ్ కమీషన్ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి కుప్పంలో సోమవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. కుప్పం కొత్తపేట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ చౌక దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆపై నడిమూరు గ్రామంలోఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డికెపల్లి వద్ద గల సివిల్ సప్లైస్ గోడౌన్‌కు చేరుకున్నారు. అక క్కడ ఉన్న స్టాకు వివరాలు పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు డీలర్లు మాట్లాడుతూ కుప్పం పట్టణంలో పలుచోట్ల నాలుగు రోజులుమాత్రమే నిత్యావసరాలు వేయడం జరుగుతోందని ఈ సమయంలో ఇతర ప్రాంతాల వారు బియ్యం తీసుకువెళ్తున్నారని తమ పరిధిలో ఉన్న వారికి సరుకులు అందించలేకపోతున్నామని పేర్కొన్నారు. దీంతో ఛైర్మన్ మాట్లాడుతూ నిత్యావసర సరుకుల పంపిణీకి పోర్టబులిటీ విధానం అమలులో ఉందన్నారు. ఎవరుఎక్కడైనా సరుకులు పొందే అవకాశం ఉందన్నారు. అనంతరం కుప్పంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం, ఎపి మోడల్ స్కూల్, కెజిబివిలో తనిఖీలు చేపట్టారు.

**శాంతిపురం :** రాష్ట్ర ఫుడ్ కమీషన్ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి మండలంలో పర్యటించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తులసినాయనపల్లి వద్దగల కస్తూరిబా గురుకులంలో తనిఖీలు చేపట్టారు. శాంతిపురంలో రేషన్ దుకాణాన్ని పరిశీలించారు.

**వి.కోట :** స్థానిక బాలురహైస్కూల్, హాస్టల్‌ను సోమవారం రాష్ట్ర ఫుడ్ కమీషన్ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు. హాస్టళ్లలో ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ అమలు చేయాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతూ ఆహారం, ఇతర వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ పనితీరుపై ఫిర్యాదులు రావడంతో షోకాజ్ నోటీసులు అందించాలని ఆదేశించారు.

# బైపాస్ రోడ్డులో వరుస ప్రమాదాలు

**తల్లడిల్లుతున్న ప్రయాణీకులు.. అతివేగమే ప్రమాదాలకు కారణమా?**



పలమనేరు బైపాస్ రోడ్డు

పలమనేరు, మార్చి 9, ప్రభాతవార్త:
పలమనేరు బైపాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయమైంది. బెంగళూరు నుండి చిత్తూరు వైపు వెళ్ళే ఈబైపాస్‌రోడ్డులో వరుస ప్రమాదాలతో ప్రయాణీకులు తల్లడిల్లుతున్నారు. ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందనని ఆందోళన చెందుతున్నారు. మితిమీరిన వేగం నిద్రమత్తులో వాహనాలు నడపడమే ఇందుకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. వారంరోజుల క్రితం కర్నాటక రాష్ట్రం బెంగళూరు నుండి తిరుమల వెళుతున్న కారు ఆగివున్న లారీని ఢీకొంది. లారీ కిందకు దూసుకు వెళ్ళడంతో కారు నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న 5 మంది అక్కడి కక్కడే మృతిచెందారు. ఈ నెల 8న మోగిలిఘాట్‌లో ఓ కారు కుక్క అడ్డం రావడంతో పల్టీలు కొడుతూ 30 అడుగుల దూరంలో బోల్తా పడింది. కారు నుజ్జునుజ్జు కాగా అందులోని ముగ్గురూ క్షేమంగా బయటపడ్డారు. అలాగే సోమవారం ఉదయం ఓ కారు మోటార్ సైకిల్‌ను ఢీకొన్న సంఘటనలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఓ వ్యక్తి కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. ఇలా వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో బైపాస్ రోడ్డు లేక ముందు బెంగళూరు నుండి చిత్తూరు వైపు వచ్చే వాహనాలు పలమనేరు పట్టణంలో నుండివచ్చేవి. లారీలు, కార్లు, ఇతర వాహనాల రద్దీతో ట్రాఫిక్ స్థంభించి పోయేది. రేయింబవళ్ళు వచ్చి పోయే వాహనాలతో తరచూ ప్రమాదాలు జరిగేవి. ఈ పరిస్థితిని దృష్టిలో వుంచుకొని కర్నాటక రాష్ట్రం నంగిలి నుండి తమిళనాడు రాష్ట్రం రాణీపేట వరకు సుమారు 250 కి.మీల దూరం బైపాస్ రోడ్డు ఏర్పాటైంది. ఇందులో భాగంగా పలమనేరు శివార్లలోని క్యాటిల్‌ఫామ్ నుండి గంటావూరు సమీపంలోని ఆంజనేయ స్వామి గుడి వరకు బైపాస్ రోడ్డును నేషనల్ హైవేలో కలిపారు. దీంతో కొంత వరకు ప్రమాదాలు తగ్గినా మళ్ళీ ఊపందుకున్నాయి. కార్లను డ్రైవర్లు కాకుండా ఓనర్లే నడపడం, రేయింబవళ్ళు తేడా లేకుండా నిద్ర మత్తులో వెళ్ళడంతో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

# సమస్యలకు నాణ్యమైన పరిష్కారం

**- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**



చిత్తూరు, మార్చి 9 ప్రభాతవార్త:
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే సమస్యలను నాణ్యంగా పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ కరుణకుమారి, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులులు హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడువు ముగిసేలోపు అర్జీలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజా సమస్యలపై మొత్తం 96 అర్జీలు అందాయి.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 358 అర్జీలు : కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, మార్చి 9 ప్రభాతవార్త:
ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో జిల్లా కలెక్టర్ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీ దారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిరక్ష్యం వహించరాదని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు శివ శంకర్ నాయక్, రోజ్మాండ్ లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు.

## పద్మావతి వర్సిటీలో తెలుగుఅధ్యయనశాఖ సదస్సు



యూనివర్సిటీ(తిరుపతి), మార్చి 9ప్రభాతవార్త:
పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో శాస్త్ర వైజ్ఞానిక పరిభాషా కమీషన్, ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ సంయుక్తంగా నిర్వహిస్తున్న త్రిభాషా సమాచార సాంకేతిక పదకోశం నిపుణుల సలహా సంఘ సమీక్ష సమావేశం సోమ వారం జరిగింది. పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యయన శాఖ అన్ని కార్యక్రమాలను క్రమశిక్షణ తో చేయటం కొనియాడదగ్గ విషయమని ముఖ్య వక్తలు తెలిపారు. తెలుగు శాఖాధ్యక్షులు, ఈ కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కేశవమూర్తి ద్రావిడ విశ్వవిద్యాలయం, డాక్టర్ రఘు ఉస్మానియా యూనివర్సిటీ, డాక్టర్ భుజంగారెడ్డి సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్, డాక్టర్ ముత్తు లక్ష్మి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టర్ నాగలక్ష్మి ,జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయం, డాక్టర్ సరిత, ,పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, డాక్టర్. వై. సుభాషిణి సభ్యులుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. డి. యువశ్రీ, డాక్టర్. బి. లక్ష్మీ ప్రియ పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలు పాల్గొని జయప్రదం చేశారు.

## ఎన్‌ఎస్‌యూలో

# అర్ధరాత్రి విద్యార్థుల ధర్నా

**నాసిరకం ఆహారం వడ్డిస్తున్నారంటూ రోడ్డుపై బైటాయింపు**



తిరుపతి విద్య. మార్చి 9 ప్రభాతవార్త.
జాతీయ సంస్కృత వర్సిటీలో విద్యార్థులు అర్ధరాత్రి రోడ్డుపై బైటాయించారు. వర్సిటీలోని వసతిగృహాలలో ఉంటున్న సుమారు 2వేల మందికి పైగా విద్యార్థులు ఒక్కసారిగా వర్సిటీలో మెరుపు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద ఎత్తున వర్సిటీ అధికారుల తీరుపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ ఎస్ యూ లోని అన్ని వసతిగృహాలలో నాసిరకం ఆహారం వడ్డిస్తున్నారని, కనీసం పశువులు సైతం ఆహారాన్ని తినేపరిస్థితి లేదని వాపోయారు. పలు మార్లు వీసీ, రిజిస్ట్రార్, హాస్టల్ అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్స్ లో త్రాగడానికి సైతం స్వచ్ఛమైన నీరు దొరికేపరిస్థితి లేదన్నారు. మెస్ బిల్లు, హాస్టల్ నిర్వహణ ఖర్చులు వేలకు వేలు విద్యార్థులను ముక్కుపిండి వసూలు చేస్తూ నాసిరకం కూరగాయలతో వంటలు వండుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. బాలుర వసతి గృహాలతో పాటు మహిళల హాస్టల్స్లోనూ ఇదే దుస్థితి కొనసాగుతోందని ఆవేధన వ్యక్తం చేశారు. తక్షణం వర్సిటీ అధికారులు తమ సమస్యలపై స్పందించి న్యాయం చేయాలని, మెరుగైన వసతితో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. లేనిపక్షంలో ఆహారాన్ని ముట్టే పరిస్థితిలేదని, తమ ప్రాణాలతో ఆడుకుంటున్న హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి హాస్టల్ను అధికారులు ప్రతి నిత్యం క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నా స్థలానికి వర్సిటీ అధికారులు పోలీసుల అండతో చేరుకుని విద్యార్థులతో చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలా..

ఎన్ ఎస్ యూ లో అర్ధరాత్రి మెరుపు సమ్మెకు దిగిన విద్యార్థులకు పలు విద్యార్థి సంఘాలు మద్దత్తు పలికాయి. వర్సిటీ అధికారులు విద్యార్థుల వద్ద వేలల్లో ఫీజులు వసూలు చేసి నాసిరకం ఆహారాన్ని అందించి వారి జీవితాలతో ఆటలాడుకోవడం దారుణమని విమర్శించారు. అధికారుల నిరక్ష్య వైఖరిని వీడి విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ ధర్నాలో వైఎస్సార్సీపీ ఎస్వీయూ విద్యార్థి విభాగం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, పలు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కుటుంబ వ్యవస్థకు మూలస్తంభం మహిళ



**-32 మంది మహిళా ఉద్యోగులకు పద్మావతి అవార్డులు**

తిరుపతి, మార్చి 9ప్రభాతవార్తప్రతినిధి:
భారతీయ కుటుంబ వ్యవస్థకు మహిళ మూలస్తంభమని టిటిడి జెఈఓ డాక్టర్ ఎ.శరత్ అన్నారు. టిటిడి ఆధ్వర్యంలో సోమవారం మహతి కళాక్షేత్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెఈఓ డాక్టర్ శరత్ మాట్లాడుతూ కుటుంబ నిర్మాణం, సమాజ అభివృద్ధి, దేశ ప్రగతిలో మహిళల పాత్ర అత్యంత కీలకమన్నారు.. మహిళలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి కూడా మార్గదర్శకులుగా నిలుస్తారని వివరించారు. ఈ సమావేశంలో టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి , మిత్రావక్ సిఈఓ ఆశ్లేష ,డిఆర్‌డిఓ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రిక కౌశిక్ సమాజంలో సానుకూల మార్పు రావాలంటే మహిళలు ముందుగా తమను తాము ప్రాధాన్యంగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులు బాధ్యతలను పంచుకుంటే మహిళలపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. అనంతరం టిటిడిలోని పలు విభాగాల్లో విశేష సేవలు అందిస్తున్న 32 మంది మహిళా ఉద్యోగులకు ఈ సందర్భంగా పద్మావతి అవార్డులు ప్రదానం చేశారు. వారిని శాలువాతో సత్కరించి, 5 గ్రాముల వెండి డాలర్ ,పద్మావతి అమ్మవారి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల బృందం ప్రదర్శించిన భరతనాట్యం, వీణా వాద్యకచేరి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మహిళా ఉద్యోగుల కోసం నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్, క్విజ్,

# అధికారులూ.. అధైర్యపడవద్దు...అండగా ఉంటా

**-చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని**

తిరుపతిరూరల్, మార్చి 9 ప్రభాతవార్త:
అధికారులు ఎవ్వరూ కూడా ....ఎవరి బెదిరింపులకు భయపడనవసరలేదని... ఏ అధికారినైన బెదిరిస్తే ...అధికారులందరూ ఏకమై ముక్తాకంఠంతో ఖండించాలని మండల అధికారులకు ఎమ్మెల్యే పులివర్తి నాని భరోసా ఇచ్చారు. సోమవారం తిరుపతి ఎంపిడిఓ సమావేశ మందిరములో మండల అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఎవరైనా రాజకీయ నాయకులు, వ్యక్తులుగాని బెదిరింపులకు దిగితే భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఎప్పుడూ ప్రభుత్వ అధికారులను వ్యక్తిగత పనుల కోసం ఉపయోగించుకోలేదని స్పష్టం చేశారు. అధికారుల పనితీరులో పారదర్శకత ఉండాలని, అవినీతి చేయమని తాను ఎప్పటికీ ప్రోత్సహించనని తెలిపారు. అవినీతి లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీలలో నిధుల దుర్వినియోగంపై తనవద్ద సమగ్ర సమాచారం ఉందన్నారు.



రాజకీయ అంశాలపై కూడా ఆయన స్పందిస్తూ 2034 వరకు ఎన్డీఎ కూటమి అధికారంలో ఉంటుందని, చంద్రగిరి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో తానే ఎమ్మెల్యేగా కొనసాగుతామని ధీమా వ్యక్తం చేశారు. మండలం పేదలకు రామాపురంలో 3సెంట్ల ఇంటి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

చంద్రగిరి నియోజకవర్గంలోని పంచాయతీలు జాతీయస్థాయి పురస్కారాలు అందుకునే విధంగా అధికారులు కృషి చేయాలని సూచించారు. వివాదాలకు దూరంగా ఉండి, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు కాలంలో తిరుపతిరూరల్ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులపై కూడా అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో ప్రభుత్వ భూములు అక్రమంగా ఆక్రమణకు గురవుతున్న విషయంపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములపై అన్యాక్రాంతాలు ఉంటే వెంటనే గుర్తించి అక్రమ కట్టడాలను తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. క్రికెట్ స్టేడియం, జిమ్‌లను లీజుకు తీసుకున్న గుత్తేదారులు పన్నులు చెల్లించడం లేదని, విద్యుత్ బకాయిలను పంచాయతీ నిధులతో చెల్లించడం విచిత్రంగా ఉందన్నారు. ఉపాధి హామీ పనులలో ఇంకా కొంతమంది దొంగ మస్టర్లు నమోదు చేసి, వారం వారం బిల్లు తీసుకుంటున్నారనే ఫిర్యాదులు అందాయని, ఇలానే కొనసాగితే టెక్నికల్ అసిస్టెంట్‌ను తొలగింపు తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిపిఓ సుశీలాదేవి, ఎంపిడిఓ మస్తాన్ వల్లి, డిప్యూటీ ఎంపిడిఓ దయాసాగర్, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్వోలు పాల్గొన్నారు.

## ఈ లిక్కర్ బార్ మాకొద్దు
### ఎన్టీఆర్ కాలనీవాసుల వేడుకోలు




గంగాధర నెల్లూరు మార్చి 9 ప్రభాతవార్త: ఈ లిక్కర్ బార్ మాకొద్దు మండలంలోని పెద్ద కాల్వ పంచాయతీకి చెందిన ఎన్టీఆర్ కాలనీ వాసులు ఈ లిక్కర్ బార్ మాకొద్దు అంటూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ బస్టాండు వద్ద కుటుంబ నివాస ప్రాంతాలకు సమీపంగా ఈ బార్‌ని నెలకొల్పి భయబ్రాంతులకు గురి చేస్తున్నారని నిబంధనలకు విరుద్ధంగా ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు కూడా బారుని తెరచి ఉంచుతున్నారుని మేము తలుపులు మూసి నిద్రపోతున్న సమయంలో మద్యం ప్రియులు ఇంటి గుమ్మాల ముందరే కూర్చుని మద్యం సేవిస్తున్నారుని, కూలి పనులకు వెళ్లే మహిళలు పాఠశాలలకు వెళ్లే విద్యార్థిని విద్యార్థులు బస్సు ఎక్కాలంటే భయపడే పరిస్థితి నెలకొందని అన్నారు.పగలు రాత్రి ఒంటరి మహిళలు, పిల్లలు తమ నివాసాలలో ఉండటానికి ఎప్పుడు ఎం జరుగుతుందోనని భయం వేస్తుందని అన్నారు. జిల్లా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి ఈ లిక్కర్ బార్‌ను నివాసాలకు బస్‌స్టాప్ దూరంగా నెలకొల్పాలని వీరు డిమాండు చేశారు. కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి తగు చర్యలు చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

## దారి లేక విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటులో జాప్యం

పాలసముద్రం. మార్చి 9 ప్రభాతవార్త:



మండలంలోని శ్రీ కావేరిరాజుపురం గ్రామ రెవిన్యూ లెక్కలలో పొలం ఉన్న సుబ్రహ్మణ్యం మండడి గత కొంతకాలంగా ట్రాన్స్ఫార్మర్ అమర్చడానికి పొలం వద్దకు వెళ్లడానికి దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. విద్యుత్ సర్వీస్ నెంబర్ 5612310002618, 5612310000560 రెండు సర్వీస్‌లు కలిపి 15 హార్స్ పవర్ ఉన్నాయి నూతనంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిన రుసుమును కట్టి ట్రాన్స్ఫార్మర్ తెచ్చుకొని గత ఆరు నెలలుగా దారి కోసం ఎదురుచూస్తున్నాడు. గత కొద్ది రోజులకు ముందు ప్రభుత్వ భూములు ట్రాన్స్ఫార్మర్ తీసుకెళ్లడానికి దారి ఏర్పాటు చేసుకున్నాడు. రాజకీయ రంగు పులిమికుని ఏర్పాటు చేసిన దారిని రెవెన్యూ అధికారులు మూసివేశారు. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు అన్నట్టుగా విద్యుత్ అధికారులు ట్రాన్స్ఫార్మర్ ఇచ్చిన రెవెన్యూ అధికారులు దారి ఇవ్వలేదు అని రైతు ఆవేదన వ్యక్తపరిచాడు. 6 నెలలుగా జాప్యం జరుగుతోందని ప్రస్తుతం ట్రాన్స్ఫార్మర్ శ్రీకావేరి రాజపురం సబ్ స్టేషన్‌లో ఉందని రైతు తెలిపాడు. ప్రస్తుతం వేసవి కావడంతో ఉన్న పంటలు తీవ్రంగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్త పరిచాడు .ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి తనకు దారి కల్పించి న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

## ఎస్‌టియు ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ.

పాలసముద్రం, మార్చి 9 ప్రభాతవార్త:

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి పబ్లిక్ పరీక్ష రాసే విద్యార్థులకు ఎస్టియు యూనియన్ వారు పరీక్షకు ఉపయోగపడే విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డు కాదని ఈ పరీక్షలో ప్రతి ఒక్క విద్యార్థి మంచి మార్కులతో పాస్ అవ్వాలని వారిని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో ఎస్టియు కార్యవర్గం జిల్లా స్థాయి నాయకులు , మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంకు చొరవ చూపాలి - కడ పి.డి.

కుప్పం, మార్చి 9 ప్రభాతవార్త



అధికార య ం త్రాంగం ప్రజల సమస్యల పరిష్కారంకు చొరవ చూపాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను కడ పి.డి. నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలనుంచి నేరుగా వినతులు సీ ్వకరించి వాటి పరిష్కారంకై సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు రోజుకు అర్ధగంట ప్రజలనుంచి వచ్చిన వినతులపై దృష్టి సారించాలన్నారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలుగా విభజించి వాటిలో ఏవి త్వరగా పూర్తవుతాయో వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు చిట్టిబాబు, శివయ్య, డిఇలు ప్రభాకర్, గురవారెడ్డి, పురుషోత్తం, దస్తగిరి,ఎఇ ఫయాజ్‌బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మార్గమహేశ్వరస్వామి ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



బైరెడ్డిపల్లి, మార్చి 9 ప్రభాతవార్త

మండలంలోని నెల్లిపట్లలో వెలసిన శ్రీ మార్గ మహేశ్వరస్వామి వస ంతోత్స వంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొన్నారు. గత ఐదు రోజులుగా తిరునాళ్లు ఘనంగా నిర్వహిం చారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను ఎమ్మెల్యేకు అందిం చారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ రాజన్న, నేతలు కిషోర్‌గౌడు, సుబ్రమణ్యంశెట్టి, నాగరాజు, జయప్ప, రమేష్‌రెడ్డి, గోవర్ధన్, జగదీష్, విల్వనాథ్, అరుణ్, పళని, ఉపేంద్ర, తిప్పారెడ్డి, రెడ్డెప్ప, దేవేంద్ర, కళ్యాణ్, సురేష్ పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్ట్ భూముల రైతులకు చెక్కులు పంపిణీ



రామకుప్పం, మార్చి 9 ప్రభాతవార్త

మండలంలోని విజలాపురం వద్ద నిర్మించనున్న ఎయిర్‌పోర్టు నిర్మాణంకు భూములిచ్చిన కడచిన కుప్పం గ్రామ రైతులకు మంగళవారం ఎపిఎస్ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు ప్రభుత్వం తరపున చెక్కులు పంపిణీ చేశారు. 73మంది రైతులకు 40కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు కుప్పం ప్రాంత భవిష్యత్తుకోసం ఎయిర్‌పోర్టు, పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టారన్నారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ విజయలక్ష్మి, తహశీల్దార్ కౌలేష్, దేశం నేతలు మునస్వామి, పత్ర నారాయణ, వెంకటరమణ, ఆనందరెడ్డి, కామరాజు నాయక్, రామూర్తి, శ్రీనివాసులురెడ్డి, గుర్రప్ప, వెంకటరామగౌడు, జయశంకర్, కుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ భరత్ ఆరోపణలు అవాస్తవం : తెదేపా నేతలు



రామకుప్పం, మార్చి 9 ప్రభాతవార్త

బందార్లపల్లి వద్ద ప్రభుత్వ భూములు ఆ క్రమణకు గురయ్యాయని ఎమె ్మల్సీ భరత్ శాసనమండలిలో చేసిన ఆరోపణలు అవాస్తవం అని పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, తెదేపా నేతలు పేర్కొన్నారు. బందార్లపల్లి వద్ద సర్వేనెం 577/7లో ఉన్న 1.03 ఎకరాల భూమిలో 12సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో హాస్టల్‌కు 12సెంట్ల భూమి ఇచ్చారని చెప్పడం సరికాదన్నారు. గతంలో జగనన్న కాలనీలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో పట్టాలు మంజూరు చేసి లక్షల రూపాయలతో ప్రజలు కొన్నారని త్వరలోనే సర్వే చేసి ఒరిజినల్, నకిలీ పట్టాలపై నిగ్గు తేల్చుతామన్నారు. మండలంలో దురాక్రమణ భూములు ప్రతి ఒక్కటీ సర్వే చేయించి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, మునస్వామి, పత్ర నారాయణ, వెంకటరమణ, ఆనందరెడ్డి, కామరాజు నాయక్, రామూర్తి, శ్రీనివాసులురెడ్డి, గుర్రప్ప, వెంకటరామగౌడు, గ ంట్లప్పగౌడు, కృష్ణనాయక్, జయశంకర్, రామకృష్ణ, సత్తి పాల్గొన్నారు.

## రాష్ట్రంపై అప్పులభారం మోపిన వైకాపా : గౌనివారి

శాంతిపురం, మార్చి 9 ప్రభాతవార్త



వైకాపా ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేయడంతో పాటు అప్పులభారం మోపి వెళ్లారని మాజీ ఎమె ్మల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. కాగ్ నివేదిక ప్రకారం 2024-25కు అప్పు మొత్తం 81.071కోట్లు అని అయితే ఈ అప్పు మొత్తం కూటమి ప్రభుత్వం చేసి ందని వైకాపా ప్రచారం చేయడం దారునుణమన్నారు. 2024ఏప్రిల్‌లో వైకాపా ప్రభుత్వం 11497కోట్లు, మేలో 15708కోట్లు అప్పులు చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై అప్పుల భారం పడుతోందన్నారు. జగన్‌రెడ్డి చేసిన 9.74లక్షల కోట్ల అప్పులు, బకాయిలకు ప్రభుత్వం ఏటా 71881కోట్లు చెల్లింపులు చేసిందన్నారు. గత ప్రభుత్వం వెండర్లు, కాంట్రాక్టర్లకు 1.35లక్షల కోట్ల బకాయిలు పెట్ి ందన్నారు. కూటమి ప్రభుత్వం అందులో 20వేల కోట్లు చెల్లించిందన్నారు. రాష్ట్రాన్ని అప్పులపై కాక అభివృద్ధి, ఆదాయాలపై ఆధారపడే స్థితికి సిఎం చంద్రబాబునాయుడు తీసుకువచ్చారన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : ఎంపిడిఒ

శాంతిపురం, మార్చి 9 ప్రభాతవార్త



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపిడిఒ పిఆర్ కుమార్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్స వ వేడుకలను స్థానిక మండల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు తల్లి, చెల్లి, అత్త, కోడలు, కూతురిగా వివిధ రూపాల్లో తమ విధులు నిర్వహిస్తున్నా రన్నారన్నారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అంతరిక్షం నుంచి రక్షణ రంగం, వ్యాపారం నుంచి రాజకీయాల దాకా రాణిస్తున్నారన్నారు. మహిళలు విద్యలో మరింత రాణించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ ఈశ్వరన్న, ఎఇ మనోజ్ఞ, ఎపిఎం శ్రీనివాసులు, ఎపిఒ రెడ్డెమ్మ, మహిళా అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

**ఎస్టీయు అధ ్వర్యంలో :** ఎస్టీయు ఉపాధ్యాయ శాఖ అధ్వర్యంలో మహిళా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కార్యాలయంలో మండలంలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

## బిజెపి బలోపేతానికి కృషి చేయాలి

వి.కోట, మార్చి 9 ప్రభాతవార్త



మండలంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నేతలు కృషి చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు సోమశేఖర్ కోరారు. మంగళవారం స్థానిక తేజ కళ్యాణ మండపంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లి పార్టీపై విశ్వాసాన్ని ప్రజల్లో కలిగిస్తామన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో నేతలు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గణనాధుని సన్నిధిలో నారా గిరీష్



కాణిపాకం, మార్చి 9 ప్రభాతవార్త:

చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే దివంగత నారా రామ్మూర్తినాయుడు కుమారుడు నారా గిరిష్ సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ మణి నాయుడు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, లయ సూపరెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు స్పందనకు 46 సమస్యలు

చిత్తూరు, మార్చి 9 ప్రభాతవార్త:



ప్రజల సమస్యలను పరిష్కరించడానికి పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఎస్పీ తుషార్ డూడి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి 46 సమస్యలు అందాయి. ఈ సమస్యలను క్షేత్ర స్థాయిలో సత్వరం పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు శాఖ అధికారులను ఎస్పీ తుషార్ డూడి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడితో పాటు ఆపరేషన్స్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జ్ అడ్మిన్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌లు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా భూతగాదాలకు సంబంధించి 15 సమస్యలు రాగా ఆస్తి తగాదాలు 7, కుటుంబ తగాదాలు 6, డబ్బు తగాదాలు 4, పోలీసు సేవలు 3, చీటింగ్ 2, సైబర్ క్రైమ్, చిన్న గొడవలు, దొంగతనంకు సంబంధించి ఒకొక్క ఫిర్యాదు అందింది.

## మున్సిపల్ గ్రీవెన్స్‌కు 8 సమస్యలు

చిత్తూరు, మార్చి 9 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నగర ప్రజల నుండి సమస్యలపై 8 అర్జీలు అందాయి. వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ ఎ.ప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.లోకేష్, మున్సిపల్ ఇంజనీర్ వెంకటరమణారెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్రలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూకు సంబంధించి 3, టిడ్కో 2, ఇంజనీరింగ్ విభాగం 2, ప్రజారోగ్య విభాగంకు సంబంధించి ఒక అర్జీ అందాయి.

## మండల డిప్యూటీ ఎంపిడిఓగా గఫూర్



చౌడేపల్లి, మార్చి 9 ప్రభాతవార్త

మండల డిప్యూటీ ఎంపిడిఓగా గఫూర్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయన సోమవారం స్థానిక మండల పరిపాలనా భవనంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న కృష్ణవేణి రామసముద్రం మండలానికి బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న ఆయన ఇక్కడికి నియమితులయ్యారు. ప్రజలకు అందుబాటులో వుండి మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని బాధ్యతలు చేపట్టిన గఫూర్ అన్నారు.

## కారు ఢీకొని..ఒకరికి తీవ్ర గాయాలు

గంగవరం,మార్చి 9, ప్రభాతవార్త :



కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం ఉదయం మండలంలోని దండపల్లె కూడలి సమీపంలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా..కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరం కార్వేనగర్ సమీపంలోని మాండేకు చెందిన సుబ్రమణ్యరావు(60) తన కుటుంబ సభ్యులు మరో ముగ్గురుతో కలిసి తిరుపతికి కారులో వెళ్తుండగా మండలంలోని బెంగళూరు,చెన్నై జాతీయ రహదారిపై దండపల్లె కూడలి సమీపంలో ప్రధాన రహదారిపై వస్తుండగా ఇదే సమయంలో కల్లుపల్లె గ్రామానికి చెందిన సురేంద్ర(42) అనే వ్యక్తి తన ద్విచక్రమాహనంపై తమ స్వగ్రామానికి ప్రధాన రహదారి పక్కన ఉన్న చిన్న రహదారిపై వెళ్తుండగా కారు వేగంగా,నిర్లక్ష్యంగా వస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొని రహదారి పక్కనున్న ముళ్ళ పొదల్లోకి దూసుకుపోయింది.ఈ ప్రమాదంలో సురేంద్ర కాలు తొడ భాగంలో విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు.తీవ్రంగా గాయపడ్డ సురేంద్రను స్థానికులు 108 వాహనంలో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రథమ చికిత్స అనంతరం సురేంద్ర పరిస్థితి విషమంగా ఉండడంతో కుప్పం పిఈఎస్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నెల్లిమండపల్లెలో శతాధిక వృద్దురాలు మృతి

ఐరాల, మార్చి 9 ప్రభాతవార్త:



మండలంలోని నెల్లిమండపల్లె గ్రామానికి శతాధిక వృద్దురాలు సుందరమ్మ(101) సోమవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. నెల్లిమండపల్లెకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి చెన్నప ్ప భార్య సుందరమ్మ అనే శతాధిక వృద్దురాలు గత కొంతకాలంగా వృద్ధాప్యపు సమస్యలతో బాధపడుతూ సోమవారం కన్నుమూశారు. ఈమె ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. ఈమె భర్త గత 30 ఏళ్ళ క్రితమే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

పాకాల, మార్చి 9, ప్రభాతవార్త




మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్వీ రమేష్ కుమార్ అన్నారు. సోమవారం కళాశాలలో మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్స వం కార్యక్రమం నిర్వహించారు. మహిళల అభివృద్ధిలో చదువు కీలక పాత్ర వహిస్తుందన్నారు. మహిళా విభాగం సమన్వయకర్త డాక్టర్ రమణమ్మ విద్యుత్ ద్వారానే మహిళలకు హక్కుల పట్ల అవగాహన, ఆర్థిక స్వేచ్ఛ, ఆత్మగౌరవం పెంపొందుతాయన్నారు. మన సంస్కృతి కళా సంస్థ రెడ్డప్ప మహిళల గొప్పతనాన్ని కీర్తిస్తూ పాటలు పాడారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మాశిలామని, చిట్టి కళావతి అధ్యాపకులు మోహనో బెహరా, ఆది శేఖర్ రెడ్డి, ఈశ్వర బాబు, మాధవి, నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.

## చదివిన పాఠశాలలోనే జయశ్రీకి అరుదైన గౌరవం

పలమనేరు, మార్చి 9, ప్రభాతవార్త:



సివిల్‌లో 360 ఆలిండియా ర్యాంకు సాధించిన జయశ్రీకి తాను చదివిని పాఠశాలలోనే అరదైన గౌరవ లభించింది. పలమనేరు ఎలీనాబెటినీ పాఠశాలలో ఎల్‌కెజి నుండి 10వ తరగతి వరకు జయశ్రీ చదువుకుంది. ఆలిండియా ర్యాంకు రావడంతో విషయం తెలుసుకున్న పాఠశాల ప్రిన్సిపాల్ ఇతర ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో సోమవారం ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ జెర్సీ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుకున్న జయశ్రీకి ఆలిండియా ర్యాంకు రావడం సంతోషదాయకమన్నారు. ఇతర విద్యార్థులు జయశ్రీని ఆదర్శగా తీసుకోవాలని పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలని సూచించారు. జయశ్రీ మాట్లాడుతూ ఆలిండియా ర్యాంకు సాధించడానికి ఎంతో కష్టపడ్డానని తనకష్టమే ఫలితం ఇచ్చిందని ఈ పాఠశాలలో చదివి ఈ స్థాయికి రావడం సంతోషదాయకమన్నారు. అంతకు ముందు జయశ్రీకి విద్యార్థులు బ్యాండు వాయిద్యాలతో స్వాగతం పలికారు.

## పాకాల సబ్ రిజిస్టర్ ఎస్ఎం రహంతుల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఏకగ్రీవం



పూతలపట్టు, మార్చి 9, ప్రభాతవార్త

జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల సంఘం పాలకవర్గం ఎన్నికలు ఆదివారం తిరుపతి రిజిస్ట్రేషన్ భవనంలో జరిగాయి. పాకాల సబ్ రిజిస్టర్ ఎస్ఎం రహంతుల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పెనగలూరు మార్చి 9 ప్రభాతవార్త

పెనమలూరు మండలం మహిళలను ఇంటా బయట, అన్నిచోట్ల గౌరవించినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని పెనగలూరు మండల విద్యాశాఖ అధికారి ఎం గిరి వరదయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్ టి యు ఏపీ) పెనగలూరు మండల శాఖ సౌజన్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని సోమవారం ఉదయం పెనగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరి వరదయ్య మాట్లాడుతూ, ఆడవారిని గౌరవించే విధానాన్ని నేటి యువతరానికి ఇంటి నుండే నేర్పించాలని కోరారు. పెనగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లం మహేశ్వర నాయుడు మాట్లాడుతూ, ఆకాశంలో సగభాగమైన మహిళలు నేడు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, అయినా కూడా సమాజంలో ఇంకా కొన్ని చోట్ల లింగ వివక్షతను ప్రదర్శిస్తున్నారని, ఇది మంచి సంప్రదాయం కాదని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి అల్లం అశోక్ కుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ, నేడు అన్ని రంగాలలో స్త్రీలు ముందడుగు వేసి సాధిస్తున్న విజయాలు, ఎదుర్కొంటున్న అడ్డంకులు, సమస్యలు చర్చించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా, పెనగలూరు కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు, పెనగలూరు, ఎన్ ఆర్ పురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ ల్లో పనిచేస్తున్న 30 మంది మహిళా ఉపాధ్యాయినీ లను, సిఆర్పిలను పట్టు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 నాగ సుబ్బారాయుడు, విశ్రాంత ఎస్టీయు సీనియర్ నాయకుడు పుచ్చకాయల యల్లయ్య, ఎస్టియు రాష్ట్ర కౌన్సిలర్లు జి. శ్రీనివాసులు, కే. యానాదయ్య, జిల్లా నాయకులు శివారెడ్డి ,రాఘవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, స్వామినాథన్, సురేంద్ర, జయ రామయ్య,కోడూరు రీజినల్ కన్వీనర్ రవి శంకర్ రెడ్డి, పెనగలూరు మండల గౌరవ అధ్యక్షులు శేషారెడ్డి, వేణుగోపాల రెడ్డి, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున, రాము, ఆర్థిక కార్యదర్శి శివ ప్రసాద్, మండల నాయకులు శశిధర్ , రమణయ్య, బి. శ్రీనివాసులు, బాదుషా, మహిళా నాయకురాల్లు నారాయణమ్మ, శ్రీదేవి, లక్ష్మీదేవి ,రేవతి, నీరజ, ప్రసన్న లక్ష్మీ, రహమతూన్, రాజేశ్వరమ్మ , భారతి, మోనిక, కేజీబీవీ ప్రిన్సిపాల్ సుచరిత, ఉపాధ్యాయినీలు, సీఆర్పీలు సుజాతమ్మ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

పెనగలూరు మార్చి 9 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం మండలంలో ఉన్నటువంటి చక్రం పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చక్రం పేట విద్యార్థులకు చిట్వేలి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని ఆ బ్రాంచ్ మేనేజర్ జె పుష్పలత మరియు బి రవి వర్మ సర్వీస్ మేనేజర్ చే పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందజేయడం జరిగినది ఈ సందర్భంగా మేనేజర్ పుష్పలత మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడమే విద్యార్థుల లక్షణం అందుకు వారు ఇప్పటినుండే కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమం నందు బ్యాంకు సిబ్బంది శివశంకర్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేబాకు గోపాలకృష్ణ అన్వర్ భాష సుదర్శనం విద్యార్థులు పాల్గొన్నారు

## వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ కార్యక్రమం విజయవంతం



చిట్వేలి, మార్చి 9,ప్రభాతవార్త:

స్థానిక ఉన్నత పాఠశాల 10వ తరగతి పిల్లల కోసం పది రోజులపాటు ఐటీ,ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ విభాగాలలో నిర్వహించిన వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్లు హెచ్‌ఎం దుర్గరాజు తెలిపారు. సోమవారం తాను మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ నైపుణ్యాలు మరియు వృత్తి విద్యపై అవగాహన కల్పించబడిందన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పై విభాగాలలో అనుభవాన్ని పొందారని హెచ్ ఎం తెలిపారు. పాల్గొన్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ సర్టిఫికెట్లు, టీషర్ట్ లు అందిం చారు. కార్యక్రమంలో వృత్తి విద్య ఉపాధ్యాయులు చిన్నబాబు,రఫీ మరియు నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.

## కోడూరు మెడిసిన్ విద్యార్థి విజయకేతనం

రైల్వేకోడూరు, మార్చి 9,ప్రభాతవార్త:



పట్టణంలోని రైల్వేకోడూరు పట్టణంలోని జామియా మసీదు అధ్యక్షులు వైసిపి పార్టీకి చెందిన సీనియర్ నేత అబ్దుల్ ముజీబ్ కుమారుడు మెడిసిన్ విద్యను పూర్తి చేసి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో పట్టాను డాక్టర్ షేక్ మొహమ్మద్ యూనస్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ద్వారా ( ఎంబిబిఎస్ )పట్టాను పొందారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన షేక్ మహమ్మద్ యూనస్ మాట్లాడుతూ తాను రైల్వేకోడూరు పట్టణంలో హైస్కూల్ విద్యను డాల్ఫిన్ డెల్ పాఠశాలలో 10 వరకు చదివి అనంతరం ఇంటర్మీడియట్ ఎస్ వి జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకొని అనంతరం తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎంబిబిఎస్ ను పూర్తి చేసి వైద్యునిగా ఈనెల 5న వైస్ ఛాన్సర్ ద్వారా గుర్తింపు పొందినట్లు తెలిపారు.

## ఏపీ జేఏసీ చైర్మన్‌గా పి.ఓబులేసు

రైల్వేకోడూరు, మార్చి 9,ప్రభాతవార్త:




రైల్వే కోడూరు తాలూకా ఏపీ జేఏసీ చైర్మన్గా పోలిచర్ల ఓబులేసు ను ఎన్నుకున్నారు.రైల్వే కోడూరు ఎన్జీవో హోం నందు ఏపీ జెఎసి సమావేశం సోమవారం సాయంకాలం నిర్వహించారు. ఈ సమావేశంలో రైల్వే కోడూరు తాలూకా ఏపీ జేఏసీని పునర్నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా తిరిగి మరల జేఏసీ చైర్మన్ గా ఏపీ ఎన్జీవో అధ్యక్ష అధ్యక్షులు పి ఓబులేసు ను,జనరల్ సెక్రటరీగా కె ఫణీంద్ర ప్రసాద్ యాదవ్, ట్రెజరర్ గా డి హరినాథ్, కో చైర్మన్ గా పి.బాలసుబ్రహ్మణ్యం, పి శంకరయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ కే రవిశంకర్ లను,వైస్ చైర్మన్ గా ఎన్ మనోహర్,యుటిఎఫ్ జై సూర్య ఏపీ ఎన్జీ జీవో అసోసియేషన్ జి సుబ్బరాయుడు,సిఐటియు సిహెచ్ చంద్రశేఖర్,అస్లాం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయకుమార్,జాయింట్ సెక్రెటరీగా డి హరినాథ్, ఎం గంగాధర్, ఏఐటియుసి జే రవిశంకర తదితరులను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఓబులేసు మాట్లాడుతూ ఉద్యోగుల ఉపాధ్యాయుల అనేక సమస్యల మీద ప్రభుత్వ మీద ఒత్తిడి తెచ్చేదానికి ఎలాంటి ఉద్యమాలకైనా మేము ముందుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవేందర్ రెడ్డి, వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సామాజిక కార్యక్రమాలకు ప్రాధాన్యత

శ్రీకాళహస్తి,మార్చి 9 ప్రభాతవార్త: సామాజిక సేవా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సోమవారం జరిగిన విశ్వబ్రాహ్మణ ఐక్య సమావేశం నిర్ణయించింది. పట్టణంలోని ధర్మరాజుల స్వామి ఆలయానికి సమీపంలోని పోతూలూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో చంద్రాచారి అధ్యర్యంలో సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పట్టణంలోని యువకులు,సంఘ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో సంఘ ప్రముఖులు మాట్లాడుతూ నేడు సమాజంలో ఎన్నో సమస్యలు చోటు చేసుకున్నాయన్నారు. ప్రభుత్వ వెసులుబాట్లు అందించటంలో అధికారులు విఫలమౌతున్నారన్నారు. విశ్వ బ్రాహ్మణ సంఘం ఐక్యతతో వ్యవహరించాలన్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే అందరూ ఐక్యంగా పని చేయాలని పిలుపు నిచ్చారు.

## వైభవంగా రామాలయ కుంబాభిషేకం



తొట్టంబేడు,మార్చి 9 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలోని పొయ్య గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయం మహాకుంబాభిషేకం కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి గ్రామంలో పండగ వాతావరణం చోటు చేసుకుంది.ఈ కార్యక్రమాలకు నియోజక వర్గ నాయకులు రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా హాజరయ్యారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఆలయ అర్చకులు శ్రీనివాసులు, మధుసూధన్‌శర్మ సారధ్యంలో పొయ్య గ్రామ పెద్దల సమక్షంలో పూజలు జరిపారు. అనంతరం శ్రీసీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కళ్యాణంలో పాల్గొన్న చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు తన్మయత్వంతో జై శ్రీరామ్ అంటూ పరవశించారు. ఈ మహోత్సవంలో మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు,ఎస్‌సివి కిరణ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో వైసిపికి చెందిన ఉమ్మడి చిత్తూరు జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, పవిత్రారెడ్డి పాల్గొన్నారు.

## 21 నుంచి శ్రీకాళహస్తిలో రైతు మహాసభలు

శ్రీకాళహస్తి,మార్చి 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో ఈ నెల 21,22 తేదుల్లో రైతు మహాసభలను నిర్వహించుటకు నిర్ణయించారని ఈ సభలను రైతులు విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి హేమలత పిలుపు నిచ్చారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ స్థానిక పుచ్చల పల్లి సుందరయ్య భవన్‌లో సోమవారం రైతు సేవా సంఘం కమిటి సమావేశం నిర్వహించారు. వరి అధికంగా పండే ప్రాంతం శ్రీకాళహస్తి సత్యవేడు అన్నారు. అయితే రైతులు పండించిన పంటను అమ్ముకొనుటకు గిట్టుబాటు ధర లేక తల్లడిల్లుతున్నారని ఆమె వివరించారు.ఈసమావేశంలో మాజీ జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య, రంగయ్య,మణి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి,ఎస్టి సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళించవద్దు



శ్రీకాళహస్తి,మార్చి 9 ప్రభాతవార్త: ప్రభుత్వాలు దళిత,గిరిజన ఎస్‌సి,ఎస్‌టి సబ్‌ప్లాన్‌కు ప్రత్యేకంగా నిధులు కేటాయించి నట్లుకేటాయించి దారిమళ్ళిస్తున్నారని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరువది సుబ్బారావు అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అనే అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి బి.నాగభూషణం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో రోజు రోజుకు అసమానతలు పెచ్చుపెరిగి పోతున్నాయన్నారు. గతంలో జగన్మోహన్‌రెడ్డి ఏ విధానాలు అమలు చేసారో కూటమి నాయకులు కూడా అదే బాటలో నడుస్తున్నారని దళిత,గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు.దళిత హక్కుల పోరాట సమితి సారధ్యంలో ఏప్రిల్ 19న విజయవాడలోజరిగే దళజత కుల పోరాటసమితి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, జైభీమ్‌అర్మీ వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీకాంత్, చిన్నం పెంచులయ్య, బి.నాగభూషణం, చిన్నం కాళయ్య, జేతులసీ రాజన్, శివకుమార్, బాలకృష్ణయ్య, ఆర్‌బలరాం, నాగేశ్వరరావు, సి.చారులత తదితరులు పాల్గొన్నారు.

## కార్వేటినగరం ఎస్‌ఐని సన్మానం



కార్వేటినగరం,మార్చి 9 ప్రభాతవార్త: కార్వేటినగరం మహిళా సబ్-ఇన్స్‌పెక్టర్ తేజస్విని గవర్నమెంటు సర్ ఖాజీ మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. యస్‌ఐతో భేటీఅయి ముస్లీంల సంక్షేమం,ప్రాంతీయ సమస్యలు, శాంతిభద్రతల పరిరక్షణలో కమ్యూనిటీ సహకారం వంటి అంశాలపై చర్చించారు. పోలీసు యంత్రాంగం అందిస్తున్న సేవలకు ఖాజీ కృతజ్ఞతలు తెలిపారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



వరదయ్యపాలెం, మార్చి 9 ప్రభాతవార్త: బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా, వరదయ్యపాలెం మండలం కారేపాకం జడ్పీ ఉన్నత పాఠశాలలో 36 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సోమవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ బిఈపిసి ఫౌండేషన్ వారి సౌజన్యంలో రియాజ్ వారి మిత్ర బృందం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్, పాఠశాల ఉపాధ్యాయులు దుష్యంత రెడ్డి, వెంకటరమణ, ఏడుకొండలయ్య, మోతీలాల్, పూడి శ్రీనివాస్ యాదవ్, కుమార్, వెంకటేశ్వర్లు, మునెమ్మ, రవికుమార్, మనోహర్, దేవిరాజి చిన్నబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ అధికారులచే బడిబాట కార్యక్రమం



కేవీబీ పురం, మార్చి 9 ప్రభాతవార్త: మండల కేంద్రం కేవీబీ పురంలోని ప్రీ ప్రైమరీ మోడల్ స్కూలులో సోమవారం బడిబాట కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారులు టి.లక్ష్మీపతి, రవికుమార్, సీఆర్పీ హెచ్‌ఎం కూనాటి సురేష్‌లచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2026-27 విద్యా సంవత్సరానికి గాను 10 మంది పిల్లలను అంగన్‌వాడీ కేంద్రం నుంచి 1వ తరగతికి ప్రీ ప్రైమరీ మోడల్ స్కూలులో ఎన్‌రోల్ చేశారు. ఈ అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చాలని అలాగే మండలంలోని అన్ని పాఠశాలల్లోని గ్రామాల్లో నుంచి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయులు తమ పరిధి ప్రాంతంలో బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ మోడల్ స్కూలు ప్రధానోపాధ్యాయులు ఏ.ఎస్.ఆర్. కె.ప్రసాద్, ఉపాధ్యాయులు ఎల్లాతి కోట ధర్మరాజుల రెడ్డి, జి.మధుస్వాతి, రాజేశ్వరి, సూపర్‌వైజర్‌లు రాజేశ్వరి, కల్పలత, అంగన్‌వాడీ టీచర్లు తాండూరు మునీశ్వరి, సీఆర్పీ సూపర్, ఐఆర్‌టీ విభాగ నవీన్, గణేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు సంస్కారం ప్రధానం



తిరుపతి విద్య మార్చి 9 ప్రభాతవార్త: విద్యతో పాటు సంస్కారం, నూతన ఆలోచనలు, నడవడిక విద్యార్థి దశలో నేర్చుకోవలసిన ప్రధాన అంశాలని ఎస్వీయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మావతి పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘ్ (ఏబీఆర్‌ఎస్‌ఎం) ఆధ్వర్యంలో పంచ పరివర్తన అనే అంశం పై సోమవారం ఎస్వీయూలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రధాన వక్త ప్రొఫెసర్ గార్లపాటి దామోదర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నేటి విద్యార్థుల ఆలోచనలపై ఆధారపడి ఉందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులకు రూ. 6వేలు నగదు బహుమతులను, ప్రశంసాపత్రాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఏ పద్మజ, ఏబిఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైపీ రామిరెడ్డి, రాష్ట్ర కోశాధికారి ప్రొఫెసర్ ఎం రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రొఫెసర్ రంజని, ఇంజనీరింగ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బాలసుబ్రమణ్యం, డాక్టర్ వివేక్, వీర నారాయణరెడ్డి, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 12న దివ్యాంగుల, వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

కేవీబీ పురం, మార్చి 9 ప్రభాతవార్త: మండల కేంద్రమైన కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12వ తేదీ గురువారం దివ్యాంగుల, వయోవృద్ధులకు సహాయం జీవన పరికరాల పంపిణీ కొరకు జిల్లా పరిపాలనా యంత్రాంగం తిరుపతి జిల్లా వారి సహకారంతో భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(ఏఎల్‌ఐఎంసీవో) ద్వారా దివ్యాంగులను పరీక్షించి సహాయ పరికరాలు కొరకు ఎంపిక చేసేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయబడుతుందని ఎంపీడీవో మాలతి పేర్కొన్నారు. మండలంలోని విభిన్న ప్రతిభావంతులందరూ వారి వారి పరికరాలు పొందడానికి ఇది ఎంపీడీవో తెలిపిన ప్రకారం సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని తెలిపారు.

## శ్రీసిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



సత్యవేడు, మార్చి 9 ప్రభాతవార్త: వివిధ రంగాల్లో మహిళల ప్రాధాన్యతను గుర్తిస్తూ శ్రీసిటీ, స్థానిక పరిశ్రమలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నాయి. ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని మహిళా హక్కులు, న్యాయం, అమలు అనే థీమ్‌తో జరుపుకుంటున్నారు. శ్రీసిటీ మేనేజింగ్‌డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీసిటీలోని రాక్వర్, బ్రేక్స్ ఇండియా, హావెల్స్, ఎన్‌కేస్ ప్యాకేజింగ్, పానాసోనిక్, శ్రీసిటీ సెక్యూరిటీ విభాగం ఇతర పలు సంస్థల్లో సోమవారం మహిళా దినోత్సవ ఉత్సాహభరితంగా వేడుకగా నిర్వహించారు. హావెల్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్‌ఆర్) నిరీషా సన్నారెడ్డి, పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో శ్రీసిటీకి చెందిన ఎన్‌కేస్ ప్యాకేజింగ్ వ్యవస్థాపకురాలు శిల్పా లింగారెడ్డి మహిళా వ్యాపారవేత్తలకు మరింత ఆర్థిక సహకారం అందించాలని కోరారు.

## ఎమ్మెల్యే పులివర్తి నానికి ఘన సన్మానం



తిరుపతిరూరల్, మార్చి 9 ప్రభాతవార్త: శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ప్రతిష్టాపన కోసం అసెంబ్లీలో ప్రస్తావన తీసుకొచ్చిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి ఘన సన్మానం చేశారు. తిరుచానూరు మార్కెట్ యార్డు చైర్మెర్ యు.మౌనిక మునిశేఖర్ ఆధ్వర్యంలో బలిజ సంఘం నాయకులు ఎమ్మెల్యేకి శాలువా కప్పి, పుష్పగుచ్చాలు అందించి ఘనంగా సత్కరించారు. శ్రీకృష్ణదేవరాయలను గుర్తు చేస్తూ... ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించాలని అసెంబ్లీలో స్వరం వినిపించిన ఎమ్మెల్యే పులివర్తి నాని కృషిని బలిజ వర్గం నేతలు అభినందించారు. ఈ సందర్భంగా తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఊరిబిండి మౌనిక మునిశేఖర్ మాట్లాడుతూ చారిత్రాత్మక మహారాజు శ్రీకృష్ణదేవరాయల సేవలను గుర్తించి విగ్రహం ప్రతిష్టించాలనే అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో కొట్టే శివకుమార్, గాజుల రవి, రామయ్య, బాబు రాయల్, వినోద్ రాయల్, డాక్టర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## నరసింహస్వామి వారికి వసంతోత్సవం



పులిచెర్ల, మార్చి 9 ప్రభాతవార్త: మండలంలోని దేవళంపేట శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పురవీధులలో విహరించారు. వసంతోత్సవం సందర్భంగా భక్తులు పసుపు నీళ్ళు చల్లుతూ చల్లుకుంటూ భక్తి భావం చాటారు. ఉదయదారులుగా బ్రహ్మ బ్రాహ్మణులు సంఘం వారు వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంత కుమారాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## స్విమ్స్‌లో గ్లకోమా అవగాహనా వారోత్సవాలు



తిరుపతి హెల్త్, మార్చి 9 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ స్విమ్స్ కంటి వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ గ్లకోమా అవగాహనా వారోత్సవాలు (మార్చి 8వ నుండి 14 తేదీ వరకు)లో భాగంగా సోమవారం ఎన్.టి.ఆర్ సర్కిల్ నుండి వాల్మీకి సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ మ్యారథాన్‌ను నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా. రాము తెలియజేశారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్లకోమా అంటే నీటి కాసుల వ్యాధి అని అర్థం. ఇది కంటి వెనుక భాగంలో ఉన్న ఆప్టిక్ నర్వ్‌ని దెబ్బతీసే కంటి వ్యాధి అని, దీని వల్ల దృష్టి కోల్పోవడం, శాశ్వత అంధత్వం వంటివి ఏర్పడుతాయని పేర్కొన్నారు. గ్లకోమా వచ్చిన వారికి కంటిలోని ఒత్తిడి పెరుగుతుందని, దృష్టి లోపం ఏర్పడుతుందన్నారు. వైద్యులను సంప్రదించి లేజర్ చికిత్స, ట్రాబెక్యూలెక్టమీ, మైక్రో ఇన్వాసివ్ గ్లకోమా సర్జరీ ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డీన్ డా. అలోక్ సచిన్, ఆర్.ఎం.ఓ.లు డా. కోటిరెడ్డి, డా. సతీష్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉషాకళావత్, ఆప్తమాలజీ విభాగాధిపతి డా. రమ్య దీప్తి, ప్రొఫెసర్, డా. శ్రీహరి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. ప్రభంజన్ కుమార్, వైద్యులు డా. వినీత, డా. తేజస్విని, డా. శ్రావ్య, ఆప్తమాలజీ టెక్నీషియన్లు మురళి, అర్జున్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు తల్లీ బిడ్డకు ప్రాణాంతకం

### -కో ఆర్డినేటర్స్ బేబి ప్రసన్న, నిర్మల రేఖ



చంద్రగిరి, మార్చి 9 ప్రభాతవార్త: బాల్య వివాహాలు చేయడం వలన తల్లీ బిడ్డ ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం వుందని ఎస్పీడబ్ల్యుయు బి.ఈడి స్పెషల్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ బేబి ప్రసన్న, అగ్రికల్చర్ కాలేజ్ కో ఆర్డినేటర్ నిర్మల రేఖ అన్నారు. తొండవాడ గ్రామంలో సోమవారం శ్రీపద్మావతీ మహిళా యూనివర్శిటీ, అగ్రికల్చర్ కాలేజ్ విద్యార్థినులు బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలు, దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ధన, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు, చిన్నపిల్లల తల్లులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వేసవి కాలం అడవులకు నిప్పు తస్మాత్ జాగ్రత్త

చంద్రగిరి, మార్చి 9 ప్రభాతవార్త: వేసవి కాలం దూసుకువస్తున్న వేళ పాడి రైతులు, ఆకతాయిలు అడవికి నిప్పు పెట్టే పరిస్థితులను గుర్తుంచుకుని అటవీశాఖ అధికారులు, సిబ్బంది తస్మాత్ జాగ్రత్త అంటూ పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. సాధారణ ఒగా వేసవి కాలంలో అటవీ ప్రాంతాలలోని వృక్ష సంపద దాదాపు ఎండిపోయి చిగురించేందుకు తొలకరి చినుకుల కోసం ఎదురుచూస్తుంటుంది. అయితే ఇది గ్రహించని కొందరు అది ఆకతాయిలు కావచ్చు, పశువుల కాపరులు కావచ్చు లేత గడ్డి కోసమని ఎండిన మొక్కలకు నిప్పుపెడతారు. ఈ నేపధ్యంలో అడవికి నిప్పు పెట్టడం వలన కలిగే దుష్పరిణామాలను వివరించి, నిప్పు పెట్టవద్దని పాడి రైతులను, పశువుల కాపరులను, గ్రామీణ ప్రాంత ప్రజలను, ముఖ్యంగా యువతను చైతన్య పరిచి అవగాహన కల్పించాల్సి వున్నది. ఇందుకు అటవీశాఖ అధికారులు ప్రణాళిక బద్ధంగా వ్యవహరించి అడవులను, పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## తల్లి ఋణం తీర్చుకోలేం!





తిరుపతి కలెక్టరేట్, మార్చి 9 ప్రభాతవార్త : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ మజ్దూర్ సంఘ్ (బి.ఎం.ఎస్.) తిరుపతి జిల్లా అధ్యక్షులు ఆకుల సతీష్ కుమార్ నిర్వహణలో ఏ జీకే బిల్డింగ్ నందు మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు, కార్మికులు బాగుంటేనే దేశం బాగుంటుంది అన్న నినాదంతో 1955లో భారతీయ మజ్దూర్ సంఘ్ (బి.ఎం.ఎస్.) ప్రారంభమై 1985 కల్లా దేశంలోనే అతిపెద్ద ట్రేడ్ యూనియన్ గా అవతరించిందని, ముఖ్యంగా మహిళలకు అన్ని రంగాల్లో సమానత్వం మరియు పరిశ్రమలలో ఉన్నత అవకాశాలు కలిగించడం కోసం బి.ఎం.ఎస్ ఎనలేని కృషి చేసిందని తెలుపుతూ ఈ సందర్భంగా ఏమిచ్చినా తల్లి రుణం తీర్చుకోలేమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వ్యక్తులుగా గంగవరపు శ్రీదేవి, వసుంధర డాక్టర్ తేజా బి.ఎం.ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వర్ణ రోహిణి కుమార్ పాల్గొన్నారు.

## రేణిగుంట సబ్ రిజిస్టర్‌గా సుస్మిత

### -సబ్ రిజిస్టార్‌కు పెనుసవాళ్లు!



రేణిగుంట మార్చి 9 ప్రభాతవార్త: రేణిగుంట సబ్ రిజిస్టర్ కార్యాలయం సబ్ రిజిస్టార్ గా సుస్మిత సోమవారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఇటీవల కాలంలో విడుదల అయిన గ్రూప్ పరీక్షల్లో ఆమె ఎంపికైంది. రేణిగుంట సబ్ రిజిస్టర్‌గా ఆమెకు మొదటి పోస్టింగ్ రావడం విశేషం. కార్యాలయం ఉద్యోగులు సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికి ఆహ్వానించారు. ప్రజలకు పారదర్శకమైన సేవలు అందిస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. రేణిగుంట సబ్ రిజిస్టర్ కార్యాలయం అవినీతి కూపముగా మారిపోయిందని ఎన్నో విమర్శలు వచ్చాయి. రేణిగుంట సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో సబ్‌రిజిస్టర్‌గా విధులు నిర్వహించాలంటే కత్తితో సాము అని చెప్పొచ్చు. రాజకీయ నాయకులు, రియల్ టర్లు,పనిచేసే ఉద్యోగులు, లేఖరులు ఆమెకు సమస్యగా మారే అవకాశం ఉందని పలువు భావిస్తున్నారు. సమస్యాత్మక కార్యాలయంలో తొలి పోస్టింగ్ ఎలా నెగ్గు కొస్తారో వేచి చూడాలి.

## కాలినడకన పోలీసుల గస్తీ



రేణిగుంట, మార్చి 8 ప్రభాతవార్త : రేణిగుంట మండలం రూరల్ సర్కిల్ గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో రూరల్ సీఐ మంజునాథరెడ్డి, గాజులమండ్యం ఎస్సై నాగరాజు తమ సిబ్బందితో కాలినడకన పోలీసు గస్తీ నిర్వహించారు. ప్రజలకు పోలీసులు తాము ఉన్నామన్న భరోసాను కల్పించారు. రోడ్డుపైకి చొచ్చుకు వచ్చిన హోర్డింగులను తట్టలను తొలగించారు. ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు.

## సీఏ ఫలితాలలో ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రతిభ



తిరుపతి విద్య మార్చి 9 ప్రభాతవార్త: ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెట్స్ ఆదివారం విడుదల చేసిన సీఏ ఫలితాలలో స్థానిక ఎమరాల్డ్స్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ మాట్లాడుతూ సీఏ ఇంటర్ ఫలితాలలో ఆర్ సరిత, ద్వారకనాథ్, రోహిత్ పటేల్ 376 మార్కులపైగా సాధించి టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. అలాగే సీఏ ఫౌండేషన్ ఫలితాలల్లో రోహిత్ కుమార్ 298మార్కులతో టాపర్ గా నిలివడం అభినందనీయమన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

## అధునాత పరికరాలపై అవగాహన పెంచుకోవాలి



తిరుపతి విద్య మార్చి 9 ప్రభాతవార్త: విద్యార్థులు అధునాత పరికరాలపై అవగాహన పెంచుకున్నప్పుడే ఎలాంటి ప్రక్రియనైనా విశ్లేషించవచ్చునని వీసీ టాటా నర్సింగరావు సూచించారు. సోమవారం రుసా సహకారంతో హోం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఫుడ్ సైన్స్లో అడ్వాన్స్డ్ ఇన్స్ట్రుమెంటేషన్ అనాలిసిస్ అండ్ అప్లికేషన్స్ అనే అంశంపై ఐదు రోజుల వర్క్షాప్ నిర్వహించారు.వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు పరికరాల సూత్రాలను పూర్తి అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, వర్క్షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ కేవీ సుచరిత, ప్రొఫెసర్ మంజుల, కె.అనూరాధ, అనూరాధ ఆర్ కె.స్వరూప, హేమ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొళాయి కనెక్షన్ల తొలగించే ఉద్యమం

శ్రీకాళహస్తి,మార్చి 9 ప్రభాతవార్త: మున్సిపాలిటి నీటిసరఫరా పన్ను వసూళ్ళకు సంబంధించి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపధ్యంలో ఎవరైతే దీర్ఘకాలంగా నీటి పన్ను చెల్లించక జాప్యం చేస్తున్న వారి ఇళ్ళ కనెక్షన్లను కట్ చేసేందుకు మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ ఆదేశించారు. దాంతో ఇంజనీరింగ్ విభాగం పన్ను చెల్లింపు దార్ల ఇళ్ళకు సంబంధించిన కనెక్షన్లు కట్ చేస్తున్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో మొత్తం 5200 కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఈ కొళాయిలకు సంబంధించి రూ.1.7కోట్లు బకాయి ఉన్నట్లు లెక్కలు తేల్చారు. ఈ ఏడాది డిమాండ్ కలుపుకొని రూ.2.72కోట్లు వసూలు కావాల్సి ఉంది. అయితే మున్సిపల్ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కఠిన చర్యలు తప్పటం లేదని కమిషనర్ భవాని ప్రసాద్ వివరణ ఇచ్చారు.

## పంట రుణాల మంజూరుకు ప్రణాళికలు



తొట్టంబేడు,మార్చి 9 ప్రభాతవార్త: మండలంలోని తంగేళ్ల పాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు పంట రుణాల మంజూరుకు ప్రణాళికలు రూపొందించి అమలుకు కృషి చేస్తున్నామని అధ్యక్షుడు బి.భాస్కర్ సమావేశంలో తెలిపారు. నేడు సహకార వ్యవసాయం సహకార సంఘం ఏర్పడిన తరువాత రైతులకు రుణాలివ్వటతో వడ్డీ వ్యాపారుల బారి నుంచి తప్పించుకున్నారన్నారు. రైతులకు అవసరమైన పంట రుణాలు తీసుకునే వారు ఇన్సూరెన్స్ డిపాజిట్లు గురించి తెలిపారు.ఈ కార్యక్రమాల్లో అధ్యక్షుడు భాస్కర్, బ్యాంకు సూపర్‌వైజర్లు మురళి, మోహన్‌కృష్ణా,టి.శరత్ కుమార్ కార్యనిర్వహణాధికారి పి.చిరంజీవి రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## 13న మినీ కూరగాయల మార్కెట్ వేలం

శ్రీకాళహస్తి,మార్చి 9 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధిలోని మినీ కూరగాయల మార్కెట్, ముత్యాలమ్మ గుడి వీధిలోని చేపల బజార్,అలాగే శ్లాటర్ హౌస్(జంతు వధ శాల) వేలం పాటలను ఈ నెల 13న నిర్వహించుటకు నిర్ణయించినట్లు కమిషనర్ భవాని ప్రసాద్ సోమవారం తెలిపారు.ఉదయం 11 గంటలకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు వివరించారు.వేలం పాటల్లోపాల్గొన దలచినవారు నిబంధనల మేరకు రికార్డులను సమర్పించి పాల్గొనాలని కమిషనర్ సూచించారు.

## జనసేన సభ్యత్వంతో ఎన్నో వెసులుబాట్లు : ఆరణి



శ్రీకాళహస్తి,మార్చి 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన సారధ్యంలో యుద్ద ప్రాతిపదికపై సభ్యత్వ నమోద కార్యక్రమాలు సాగుతు న్నాయి. మండల,గ్రామస్థాయి నుంచి సభ్యత్వ నమోదును చేపట్టారు. సోమవారం భారీ ఎత్తున సభ్యత్వ నమోదుకు ముఖ్యఅతిథిగా తిరుపతి శాసన సభ్యుడు ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ పార్టీ సభ్యత్వం ఉన్న వారికి ఎన్నో సదుపాయాలు,వెసులు బాట్లు కల్పించినట్లు వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ పర్యవేక్షణలో ఎస్‌డికె నగర్ సిఎం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ప్రజా పక్షపాతి అన్నారు.గత పదేళ్ళుగా ప్రజాసేవలో తరిస్తున్నారన్నారు. అధికారం ఉన్నా లేకున్నా ఆయన తన సొంత సొమ్ములతో పార్టీ కార్యకర్తలను అదుకుంటున్నారని వివరించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలను పంపిణి చేసారు.ఈ కార్యక్రమాల్లో తిరుపతి జనసేన పార్టీ అధ్యక్షులు రాజారెడ్డి, సత్యవేడు జనసేన పార్టీ ఇంచార్జి లావణ్యకుమార్, ఉమ్మడిచిత్తూరు జిల్లా కార్యదర్శి జయప్రకాష్, శ్రీకాళహస్తి పట్టణ నాయకులు గరికపాటి చంద్ర పార్టీ నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

## వ్యూహాత్మక మార్కెటింగ్‌తోనే రెట్టింపు ఆదాయం

తిరుపతి విద్య మార్చి 9 ప్రభాతవార్త: విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలివిలువ ఆధారిత మాంస ఉత్పత్తుల తయారీ మరియు మార్కెటింగ్ ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం అనే అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ వర్సిటీలో లైవ్‌స్టాక్ ప్రోడక్ట్స్ టెక్నాలజీ విభాగంలో ప్రారంభమైంది.ఈ కార్యక్రమాన్ని ఐసిఏఆర్ నేషనల్ మీట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్ యొక్క డెవలప్‌మెంట్ యాక్షన్ ప్లాన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ పథకం కింద పూర్తి ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం రైతులు, నిరుద్యోగ యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు గ్రామీణ పారిశ్రామికవేత్తల ఆదాయాన్ని శాస్త్రీయ విధానాలతో మాంస ఉత్పత్తులలో విలువ ఆధారిత తయారీ సమర్థవంతమైన మార్కెటింగ్ ద్వారా పెంపొందించడం. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవ సభకు శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. జె.వి.రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ డా. బి. శోభామణి వెటర్నరీ సైన్స్ డీన్ డా.ఆర్.వి. సురేష్ కుమార్ పాల్గొన్నారు. తిరుపతి అసోసియేట్ డీన్ డా.పి.జగపతిరామయ్య అధ్యక్షత వహించారు. డా. జె. వి. రమణ పశుసంవర్ధక రంగం గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి గొప్ప అవకాశా లను కలిగి ఉందని పేర్కొన్నారు. డా.గంగరాజు, అసోసియేట్ డీన్, డైరీ టెక్నాలజీ కళాశాల, తిరుపతి, డా. బి. రాంబాబు నాయక్, విభాగాధిపతి, వెటర్నరీ ఫిజియాలజీ, డా. కె.సుధీర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, లైవ్‌స్టాక్ ప్రోడక్ట్స్ టెక్నాలజీ విభాగం, డా. ఎం. కళ్యాణ చక్రవర్తి ఎఐసిఆర్‌పి ఆన్ పిగ్గరీ, తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఎస్వీయూ విద్యార్థులు



తిరుపతి విద్య మార్చి 9 ప్రభాతవార్త: చెన్నై సత్యభామ యూనివర్సిటీ వేదికగా మంగళవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు జరగనున్న నేషనల్ యూత్ ఫెస్టివల్ 2026లో ఎస్వీయూ విద్యార్థులు పాల్గొననున్నారు. యూత్ ఫెస్టివల్లో పాల్గొనన్ను ముగురు విద్యార్థుల బృందాన్ని సోమవారం వర్సిటీ వీసీ టాటా నర్సింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శృంగేరీ పీఠాధిపతి శ్రీకాళహస్తి పర్యటన



శ్రీకాళహస్తి,మార్చి 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిపుణ్యక్షేత్రంలో మంగళ, బుధవారాల్లో కంచిలోని శృంగేరి పీఠాధిపతి జగద్గురు విధుశేఖర భారతి మహాస్వామి పర్యటించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బికె వెంకటేశు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ స్వామి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. స్వామి మంగళవారం సాయంత్రం శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్నట్లు ప్రకటించారు. ఆయనకు ఆలయ సమీపంలోని జలవినాయ ఆలయం వద్ద ఘనస్వాగతం ఏర్పాటు చేసినట్లు వివరించారు. అక్కడ నుంచి స్వామివారిని ఘనంగా ఊరేగింపుగా ఆలయ దర్శనానికి ఏర్పాటు చేసినట్లు ఇఓ వెంకటేశు తెలిపారు.

